క్లుప్తంగా

20న వాహనాల వేలం

మైదుకూరు : మైదుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 20న బహిరంగ వేలం వేయనున్నట్టు కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాడిన సొమ్ము మీద ప్రతి వాహనానికి 18 శాతం జీఎస్టీతో కలిపి అదే రోజు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని స్పష్టం చేశారు. వేలం 20న మైదుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతుందని తెలిపారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వల్లూరు నాగేంద్రారెడ్డి కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రారెడ్డి తన తల్లి సరోజమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని కల్లూరు గ్రామంలో 250 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే ప్రొద్దుటూరులోని విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వల్లూరు రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్ వాయిదా

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన విద్యుత్ అదాలత్‌ను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు ట్రాన్స్‌కో ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక 12వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పరిశీలించారు. మురికి కాలువ ఆధునికీకరణ పనులను పరిశీలించిన ఆయన ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మైనారిటీ నాయకుడు సత్తార్ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డికి పూలమాల వేసి సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనీఫ్, చౌసేన్, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఉస్మాన్, మున్వర్, గౌస్, బాషా ఖాన్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో బద్వేల్ మునిసిపల్ చైర్మన్



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి గురువారం సాయంత్రం బద్వేల్ మునిసిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన రాక సందర్భంగా మఠం నిర్వాహకులు చైర్మన్‌కు ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి, అబ్బిశెట్టి వెంకటసుబ్బయ్య, దత్తాత్రేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు నగదు అందజేత

ప్రొద్దుటూరు : స్థానిక బొల్లవరం సచివాలయం-1 పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన జక్కం సుప్రజకు వైఎస్సార్ కల్యాణ మస్తు మంజూరైంది. ఆమెకు వైఎస్సార్‌కల్యాణ మస్తు పథకం కింద రూ.లక్ష మంజూరైనట్లు శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం సచివాలయంలో వైఎస్సార్‌కల్యాణ మస్తు పథకం కింద మంజూరైన రూ.లక్ష డబ్బును సుజ, ఆమె భర్త నాగలారపు చెన్నకులకు ఆయన అందించారు. తమకు కల్యాణ మస్తు పథకం కింద రూ.లక్ష మంజూరు చేయడం పట్ల సుప్రజ సంతోషం వ్యక్తం చేసింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

అట్లూరు : మండల పరిధిలోని బయ్యక్కగారిపల్లె గ్రామ సమీపాన గుబ్బకొండ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గురువారం మొదలయ్యాయి. సోమశిల జలాశయం కింద బయ్యక్కగారిపల్లె 15 సంవత్సరాల క్రితం ముంపునకు గురైంది. ఫలితంగా దత్తాత్రేయ గుడి శిథిలావస్థకు చేరుకుంది. బయ్యక్కగారిపల్లె గ్రామస్థులు దత్తాత్రేయ స్వామి గుడికి మెరుగులు దిద్దడంతో పాటు దత్తాత్రేయస్వామి మూలవిరాట్ విగ్రహాన్ని చేయించారు. మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు

- గ్రామాలను అభివృద్ధి చేస్తే సర్పంచ్‌లకే మంచిపేరు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికి అందుబాటులో ఉండే విధంగా గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం సేవలు అందిస్తోందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో గురువారం ఎంపీపీ తెలిదెల లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యంతోపాటు అన్ని రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ విధానం తీసుకొచ్చి ప్రతి 15 రోజులకొకసారి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు బోధించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు మంచి దిగుబడి రావడంతో గిట్టుబాటు ధరలు ఉన్నాయన్నారు. రబీలో సాగైన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఆర్బీకేలు, సచివాలయాలు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. గడపగడపకు కార్యక్రమం ముగిసిన గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని సర్పంచ్‌లు పనులను చేయించడం ద్వారా వారికి మంచి పేరు వస్తుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా స్థలాలు ఉండి ఇళ్లు కావాలనుకున్న వారు జగనన్న గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశ్వనాథపురం పంచాయతీలోని ఒడియరాజు పేట గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ నారాయణరెడ్డి సభా దృష్టికి తెచ్చారు. సిద్ధారెడ్డిపల్లెలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరిందని, దీనిని పునర్నిర్మించాలని గ్రామ సర్పంచ్ సరోజమ్మ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ జేష్టాది రాజీ, ఉప ఎంపీపీ సుందరమ్మ, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ సుభాని, ఏఓ మ్యాగి, వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎంఈఓ రవిశంకర్, ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఐసీడీఎస్ రీఆర్గనైజేషన్‌లో భాగంగా చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టుగా ఏర్పడటాన్ని పురస్కరించుకుని గురువారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సన్మానించారు. గత కొన్నేళ్లుగా చాపాడు మండలం జమ్మలమడుగు ప్రాజెక్టులో ఉండటంతో ఇబ్బందులు పడ్డామని వారు తెలిపారు. పునర్విభజన కారణంగా చాపాడు, బ్రహ్మంగారిమఠం, దువ్వూరు మండలాలను కలిపి చాపాడు ప్రాజెక్టుగా ఏర్పాటు చేయడం మంచి పరిణామమని చెప్పారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు



లంకమల్లేశ్వరస్వామి ఆలయం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని పలు శైవక్షేత్రాలు శివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగనున్నాయి. లంకమల క్షేత్రం, మల్లెంకొండేశ్వరస్వామి ఆలయాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ ఆధ్వర్యంలో శైవక్షేత్రాల్లో ఏర్పాట్లపై ఆయాశాఖల అధికారులతో చర్చించారు. పట్టణంలోని రూపరాంపేట శివానందస్వామి ఆలయం, నాగులచెరువు కట్ట పురాతన శివాలయం, బి.కోడూరు మండలం మేకవారిపల్లెలో వెలసిన బ్రహ్మనంద ఆశ్రమంలో ప్రతిష్ఠించిన 108 శివలింగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాగే సగిలేటి ఒడ్డున వెలసిన భవాణి సోమేశ్వరాలయం, కలసపాడులోని భవాణి శంకరాలయం, ఉమామహేశ్వర ఆలయం, కాశినాయన మండలం నరసాపురం గ్రామంలోని పురాతన శివాలయం, పోరుమామిళ్లలోని గోశృంగ మల్లికార్జున స్వామి ఆలయం, సిద్దుల క్షేత్రంలలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ప్రత్యేక పూజలు, జాగరణ చేసేందుకు భక్తులు విశేషంగా తరలిరానున్నారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

కాశినాయన : మండలంలోని నాగమునేంద్రుల గుహ (బెలూన్ గుహ), కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట విభూది శివాలయం, కనికెలగుండం, జ్యోతిక్షేత్రంలోని శివాలయాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్తాబవుతున్నాయి. భక్తులకు చలువపందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు భోజనవసతి, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు. మల్లెపల్లె దగ్గర నుండి దూదెమ్మకోన దారి వెంబడి 25 కిలోమీటర్లు రహదారిని ఏర్పాటు చేశారు. దట్టమైన అభయారణ్యంలో మునీశ్వరులు తపస్సు చేసిన పుణ్యస్థలం బెలూన్ గుహ అని పెద్దలు చెబుతుంటారు. విద్యుత్తు లేకపోవడంతో జనరేటర్లను కూడా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోరుమామిళ్ల : మండలంలో వెలసిన సిద్దులు (సిద్దేశ్వరుడు) క్షేత్రంలో శనివారం శివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుండే పూజాకార్యక్రమాలు మొదలవుతాయని ఎంపీటీసీ లక్ష్మీదేవి అన్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఉంటుందన్నారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి రేలా రే రేలా జానపద గేయాల కార్యక్రమం, భజనలు ఏర్పాటు చేశారు.

అల్లాడుపల్లెలో ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : శివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే వేలాది మంది భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేసేందుకు సత్వర చర్యలు చేపట్టాలని మండల తహసీల్దారు సుభానీ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో ఈ నెల 18, 19వ తేదీలలో నిర్వహించబోయే మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులు పర్యవేక్షణలో అధికారులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు అన్ని విధాలుగా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలన్నారు. సాధారణ భక్తులతో పాటు వీఐపీ భక్తులకు దర్శన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్, నీరు, వైద్యం, విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఐ కేసీ రాజు, సీహెచ్ఓ రాముడు, పీపీసీ పర్యవేక్షకులు భాస్కర్, ట్రాన్స్ కో ఏఈ వీరారెడ్డి, వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టాపనోత్సవాలు

దువ్వూరు : మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆవాహిత పూజ, యంత్రాభిషేకం, విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 10:15 గంటలకు యంత్ర నవరత్న, పంచలోహ సహిత ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆసక్తికరంగా బండలాడుగు పోటీలు

మహోత్సవాల్లో భాగంగా న్యూ కేటగిరి ఎద్లకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 13 జతల ఎద్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.50,016 కల్లూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల శివకృష్ణ యాదవ్ ఎద్లు గెలుపొందగా, రెండో బహుమతి రూ.40,016 మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేశ్ యాదవ్ ఎద్లు గెలుపొందాయి. మూడో బహుమతి రూ.30,016 ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన తలపనూరు శంబు రెడ్డి ఎద్లు, అరవిందనాయుడు ఎద్లు, నాలుగో బహుమతి రూ.20,016 బాలయ్యగారిపల్లెకు చెందిన నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్లు గెలుపొందాయి.



బండలాగుతున్న ఎద్లు

18న పార్వతి సమేత నగరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 18న శనివారం సాయంత్రం 5 గంటలకు పార్వతి సమేత నగరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు. రాత్రి 9 గంటలకు నగరేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతిదేవికి సహస్రనామ కుంకుమార్చన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని శివపార్వతుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

అమృతేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక పెన్నానది తీరంలోని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మరకత లింగానికి కాశి గంగాజలాభిషేకం నిర్వహిస్తున్నట్లు అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ నామా రమేష్‌బాబు, పీఆర్‌ఓ దారా సంతోష్ తెలిపారు.కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఏఆర్టీ సెంటర్ అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ

ప్రొద్దుటూరు క్రైం : ఏఆర్టీ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ ఎలా వేయాలనే దానిపై సూచనలు చేశారు. సీడీ-4 ల్యాబ్, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సూర్యనాగలక్ష్మి, శ్రీనివాసులు, డేటా మేనేజర్లు సునీల్‌కుమార్, రామకృష్ణారెడ్డి, రేవతికుమార్, వినయ్‌కుమార్, ఫార్మసిస్టు మహేశ్వరి, ల్యాబ్‌టెక్నీషియన్ సాధిక్‌బాషా, కేర్ కో ఆర్డినేటర్ లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీలో

కామనూరులోని పీహెచ్‌సీ సెంటర్‌ను అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖదర్‌వలి తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్, రోజు వారి నిర్వహిస్తున్న ఓపీ గురించి డాక్టర్ హనీఫ్‌బాబాను అడిగి తెలుసుకున్నారు.

వందశాతం పూర్తి చేయాలి

రాజుపాళెం : గర్భిణలు, పిల్లల నమోదు తదితర కార్యక్రమాలు వందశాతం పూర్తి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్ వల్లి అన్నారు. రాజుపాళెంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్‌సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. టీబీకి సంబంధించిన వివరాలను పూర్తిగా నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. వైద్యురాలు మంజుల, సీహెచ్ఓ పార్వతమ్మ, ఎంపీహెచ్ఈఓ శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపండి

- సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎంపీపీ ఆదేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యలపై గత సర్వసభ్య సమావేశంలో తీసుకున్న తీర్మానాలను అధికారులు సత్వరం అమలు చేయాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గ్రామ సచివాలయాల్లో ఉన్న సిబ్బంది ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు త్వరగా పరిష్కారం చూపాలన్నారు. మండల స్థాయి అధికారులు సమావేశాలకు తప్పకుండా హాజరుకావాలన్నారు. అప్పుడు మాత్రమే ప్రజాప్రతినిధులు తెలిపే సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ మాట్లాడుతూ వచ్చే వేసవిలో తాగునీటి సమస్యకు అధికారులకు సర్పంచ్‌లు సహకరించాలన్నారు. ఏ గ్రామంలో నీటి సమస్య ఉంటే అలాంటి గ్రామాలను సర్పంచ్‌లు గుర్తించి తెలపాలన్నారు. తొట్లపల్లె, మల్లేపల్లె, గొడ్లవీడు పంచాయతీల్లో ఉన్నట్లు సర్పంచ్ తెలుపగా, వాటిని తక్షణం పరిష్కరిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. పీసీపల్లెలో సీసీరోడ్డుకు రూ.40లక్షలు, చౌదరవారిపల్లె నుంచి బి.మఠానికి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఏఈ తెలిపారు. ముడుమాల, మలుగుడుపాడు గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని సభ్యులు అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు తెలియజేశారు. వైద్యం, ఉపాధి తదితర శాఖలకు చెందిన అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడీఓ వెంగమునిరెడ్డి, ఈఓ పీఆర్డీ జాన్‌కెనడా, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కో-అప్షన్ మెంబర్ పుల్లయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్ళ కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి రాబోవు ఎన్నికల్లో మళ్ళీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని శాస్త్రీనగర్‌లో వెంకటయ్యనగర్, రామాంజనేయనగర్ సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వానికి, ప్రజలకు, పార్టీకి వారధులుగా పనిచేయాలని కోరారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన దోపిడీని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటరీల ద్వారా నేరుగా ఇంటి వద్దకే అందుతున్న పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు. అలాగే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను, బురదజల్లే కార్యక్రమాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు రవితేజ, కరీముల్లా, వార్డు ఇన్‌చార్జి రాగిమాను ప్రతాప్‌కుమార్, సచివాలాయ కన్వీనర్లు నాగేంద్ర, వెంకటసుబ్బయ్య, రమణ, చిన్నసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్

రాజుపాళెం : గ్రామాల్లో త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్ అన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో గురువారం సాయంత్రం మండల, గ్రామ, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 562 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 210 ఇళ్లు పూర్తయ్యాయని, మిగతా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులంతా సమిష్టిగా పని చేయాలని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తరచుగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. తహసీల్దార్ ఇందిరారాణి, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, హౌసింగ్ ఏఈ శేఖర్, వర్క్ఇన్స్పెక్టర్ ఓబన్న, మండల ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, వీఆర్‌ఓలు, పంచాయితీ కార్యదర్శులు, వెల్‌ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 33 ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు

బద్వేలు అర్బన్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు ప్రకాశం జిల్లాలోని నారాయణస్వామిమఠానికి బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి 33 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 17 నుంచి 19వ తేదీన మధ్యాహ్నం వరకు సర్వీసులు నడుస్తాయని, ఇందులో లంకమల క్షేత్రానికి 22 బస్సులు, బ్రహ్మంగారిమఠానికి 4 బస్సులు, మల్లెంకొండకు 4 బస్సులు, నారాయణస్వామి మఠానికి పోరుమామిళ్ల స్టాండ్ నుంచి 3 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. బద్వేలు డిపో నుంచి లంకమలకు రూ.85లు, బి.మఠానికి రూ.50లు, మల్లెంకొండకు రూ.80లు, నారాయణస్వామిమఠానికి రూ.90లుగా టికెట్ ధర నిర్ణయించామని తెలిపారు. ప్రత్యేక బస్సులు 17వ తేది మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు.

బ్లడ్ స్టోరేజ్ యూనిట్ మంజూరు

బద్వేలు : పోరుమామిళ్ల పట్టణంలోని 50 పడకల ఆసుపత్రిలో దశాబ్దాల కాలం నుంచి అత్యవసర సమయంలో బ్లడ్ అందుబాటులో లేక పోవడంతో పట్టణానికి చెందిన ప్రైవేట్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణచక్రవర్తి గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి బ్లడ్‌స్టోరేజ్ యూనిట్‌ను మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. స్పందించి ఆయన బ్లడ్‌స్టోరేజ్ యూనిట్‌ను మంజూరు చేశారు. యూనిట్ మంజూరుకు కృషి చేసిన ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కళ్యాణచక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కలసపాడు : జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాల, శంఖవరం ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 868 మంది విద్యార్థినీ విద్యార్థులకు గురువారం పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

రేపు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : బుగ్గమల్లేశ్వర ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు బుగ్గలపల్లి సర్పంచ్ గూడ ప్రభాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం శివుడికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు ఇస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కలసపాడు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్, రి. నెం. 366, ప్రొద్దుటూరు.

నోటీసు (సభ్యులకు మాత్రమే)

ఇందుమూలముగా సంఘ సభ్యులకు తెలియజేయునది ఏమనగా పై సంఘపు 2వ కాలనీ చెన్నమరాజు పల్లె సమీపము నందు సభ్యులకు ప్లాట్లను A.P కో-ఆపరేటివ్ సొసైటీ యాక్ట్ 1964 ప్రకారము, అందలి నిబంధనల ప్రకారము మరియు సంఘము యొక్క బైలా ప్రకారము సభ్యులుగా చేరి ప్లాట్లు కావలెనని కొంత రుసుము చెల్లించియున్నారు. దాదాపు 36 సంవత్సరముల పై బడి మీ నుండి ఎలాంటి సమాచారము రాలేదు. మీరు మిగిలిన రుసుము చెల్లించి, ప్లాట్లు పొందుటకు ఈ ప్రకటన తేది నుండి 15 దినముల లోపల సంఘమునకు వచ్చి మీ వివరములను, అందుకు తగిన రికార్డ్‌లను సంఘ పాలక వర్గమునకు అందజేసి మీ ప్లాటును పొందవలసిందిగా మనవి.

ఆ విధముగా సభ్యులు తమ ప్లాటును పొందుటకు రాని యెడల సదరు సభ్యులకు ప్లాటు అవసరము లేదు అని పాలక వర్గము వారు తీర్మానించి సదరు ప్లాటును 15 దినముల తరువాత A.P కో-ఆపరేటివ్ సొసైటీ యాక్ట్ 1964 ప్రకారము మరియు సంఘ బైలా ప్రకారము అర్హులైన సంఘ సభ్యులకు కేటాయిస్తూ తీర్మానించి రిజిస్టర్ చేయబడును.

తేది: 16-02-2023
స్థలము: C/o. N.G.O. హోమ్, ప్రొద్దుటూరు.

ఇట్లు : పాలక వర్గము
ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లి. రి.నెం. 366